క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సమావేశం

తుని రూరల్: మండల పరిషత్ సాధారణ సమావేశం, బడ్జెట్ సమావేశం గురువారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.సాయి నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి సభ్యులు, మండలస్థాయి అధికారులకు సమాచారం అందించామన్నారు. ఎంపీపీ అనుమతితో మండల ప్రగతిపై శాఖలు వారీగా చర్చించనున్నట్టు తెలిపారు.

94.42 శాతం పింఛన్ల పంపిణీ

తుని రూరల్: మండలంలో మొదటిరోజు 94.42 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కె.సాయినవీన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు 12123 మందికి 11,447 మంది లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము రూ.4.98 కోట్లు అందించామన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి అందించడంతో పింఛన్ల పంపిణీలో జిల్లాలో మూడో స్థానంలో నిలిచారు.

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

ఏలేశ్వరం: డిపో డ్రైవర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న ఆందోళన మంగళవారం నాటికి 39వ రోజు కొనసాగింది. డిపో జేఏసీ ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద ఉద్యోగులు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ ఎస్వీ రమణను 1/2009 సర్క్యులర్‌కు విరుద్ధంగా అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగులు ధర్నాలు చేస్తున్న యాజమాన్యం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎస్వీ రమణను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి టి.త్రిమూర్తులు, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి యూబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎన్వీరావు, అధికసంఖ్యలోఉద్యోగులు పాల్గొన్నారు.

పశువుల తొట్టె నిర్మాణానికి శంకుస్థాపన

గండేపల్లి: నీలాద్రిరావుపేటలో పశువుల తొట్టె నిర్మాణానికి మంగళవారం గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్ శంకుస్థాపన చేశారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.35000తో నిర్మాణం చేపట్టనున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గంగాభవాని, ఈసీ రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమ్మర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల పోస్టర్ విడుదల

జగ్గంపేట: గ్రామంలో వచ్చే నెలలో సమ్మర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గంలోని క్రికెట్ జట్లు ఇందులో పాల్గొనవచ్చని, అయితే ఈ నెల పదో తేదీలోపు క్రికెట్ జట్లు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు, ఎస్సై రఘునాథరావు, భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి, ఆవిష్కరించారు. ప్రీమియర్ లీగ్ ఫైనల్స్‌లో గెలుపొందిన జట్టుకు రూ.25వేలు, రెండో స్థానంలో గెలుపొందిన జట్టుకు రూ.15వేలు బహుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు.

ఉపాధి పనుల ప్రారంభం

గోకవరం: మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులను కామరాజుపేట గ్రామంలో మంగళవారం ప్రారంభించారు. ఏపీఓ శేషఅప్పలరాజు ఆధ్వర్యంలో ఎంపీడీఓ గోవిందు, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, సర్పంచ్ అడపా వెంకట్రావులు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఎంపీడీవో గోవిందు, ఏపీఓ అప్పలరాజు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో మండలంలో 5,30,000 పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, వేతనదారులు పాల్గొన్నారు.

ఫైలేరియా కిట్ల పంపిణీ

తొండంగి: ఎ.వి.నగరం పీహెచ్‌సీలో మంగళవారం ఫైలేరియా కిట్లు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ ఆధ్వర్యంలో ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్న వారికి టబ్, మగ్గు, టవల్, సోప్‌లతో కూడిన కిట్లను అందజేసారు. ఫైలేరియా రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యురాలు భారతి, యనమల నాగేశ్వరరావు, హెల్త్‌సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గరగ నృత్య కళాకారులకు దుస్తుల పంపిణీ



గరగల నృత్య కళాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ముద్రగడ పద్మనాభం, గిరిబాబు

కిర్లంపూడి: గ్రామంలో ఉన్న నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అట్టహాసంగా ముగిశాయి. గత నెల రోజులుగా గ్రామంలో గరగల సంబరం నిర్వహించిన కళాకారులను బుధవారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు సత్కరించి, వారికి దుస్తులు పంపిణీ చేశారు.

ఆ స్థలంపై రీ సర్వే

- 'పంపా' రిజర్వాయర్ పక్కన స్థల ఆక్రమణలపై మళ్లీ సర్వే
- పంపా తీరాన పవర్ ఆఫీసు వద్ద నిర్మాణాలపై వివాదం
- ఆ స్థలం తమదేనని రికార్డులు చూపిస్తున్న దేవస్థానం, ఇరిగేషన్ అధికారులు
- రికార్డుల పరిశీలించిన పెద్దాపురం ఆర్డీఓ రమణి



పంపా రిజర్వాయర్ రికార్డులు పరిశీలిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ రమణి, ఇతర అధికారులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఘాట్ రోడ్డు పక్కనే పంపా రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న స్థల వివాదంపై మంగళవారం మళ్లీ రీ సర్వే జరిగింది. జిల్లా లాండ్ రికార్డులు, సర్వే శాఖ అధికారులు రెండోసారి జాయింట్ సర్వే చేశారు. అయితే గత ఏడాది ఆగస్టులో సర్వే నిర్వహించగా ప్రస్తుతం పంపా రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న హరిణి బోట్ షికార్ కట్టడాలతోపాటు, రిజర్వాయర్ లోపల 30 మీటర్లు వరకు స్థలం దేవస్థానానిదే అని తేలింది. అయితే దీనిపై ఇరిగేషన్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసి రీ సర్వే జరగాలని కోరడంతో మంగళవారం మళ్లీ రీ సర్వే నిర్వహించారు.

వివరాల్లోకి వెళితే..

అన్నవరం దేవస్థానానికి ఆరెంపూడి గ్రామ సర్వే నంబర్ 24బీలో 54.69 ఎకరాల కొండ ఉంది. స్థానిక దేవస్థానం క్వార్టర్స్ నుంచి ప్రారంభమై రత్నగిరిపై రామాలయం నుంచి పంపా రిజర్వాయర్ వరకు స్థలం రికార్డులలో దేవస్థానానికి చెందిందిగా నమోదై ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఇందులో రెండో ఘాట్‌రోడ్‌ను ఆనుకుని పవర్ హౌస్ వరకు ఉన్న పంపా రిజర్వాయర్ స్థలం కూడా తమదేనని దేవస్థానం అధికారులు తెలిపారు.

ఆక్రమణలు ఖాళీ చేయించాలని ఆర్డినెన్స్

2023లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్–5 ప్రకారం దేవస్థానం స్థలం ఆక్రమించిన వారికి నోటీసు ఇచ్చి నిర్దేశించిన సమయంలో తగు సమాధానం చెప్పకపోతే వెంటనే ఆ ఆక్రమణలు కూల్చి వేయాలని పేర్కొన్నారు. దాని ప్రకారం దేవస్థానం అధికారులు తమ స్థలంలో ఉన్న హరిణి బోట్ షికార్ నిర్మాణాలు అక్రమ నిర్మాణాలుగా గుర్తించి ఇరిగేషన్ అధికారులకు గత ఏడాది జూలైలో నోటీసు ఇచ్చారు. ఆ నోటీస్‌కు ఇరిగేషన్ అధికారులు స్పందిస్తూ అది తమ స్థలమేనని తెలిపారు. దీనిపై అప్పటి దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపడంతో దీనిపై జాయింట్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గతేడాది ఆగస్టులో నిర్వహించిన జాయింట్ సర్వేలో ఆ స్థలం దేవస్థానానిదేనని తేలింది. దానిపై ఇరిగేషన్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మళ్లే రీ సర్వేకు కలెక్టర్ ఆదేశించారు.

అధికారుల సమక్షంలో జాయింట్ సర్వే

కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పంపా రిజర్వాయర్ స్లూయజ్ గేట్లు ఎదురుగా ఉన్న కొండ వద్ద నుంచి పవర్ హౌస్‌కు వద్దకు వెళ్లే మార్గంలోని హరిణి బోట్ షికార్ నిర్మాణాల వరకు జాయింట్ సర్వే నిర్వహించారు. లాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డీ భారతి, డిస్ట్రిక్ట్ లాండ్ రికార్డ్స్ అండ్ సర్వే డీఈ కే శ్రీనివాస్, అన్నవరం దేవస్థానం డీసీ చంద్రశేఖర్, ఏసీ రామ్మోహన్‌రావు, ఈఈ రామకృష్ణ, సూపరింటెండెంట్ బలువు సత్య శ్రీనివాస్, ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ తరుపున ఈఈ శేషగిరిరావు హాజరయ్యారు. కాగా, పెద్దాపురం ఆర్డీఓ కే రమణి పంపా ఒడ్డున గల నిర్మాణాలను పరిశీలించారు. దానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. దేవస్థానం, ఇరిగేషన్ అధికారుల వాదనలను విన్నారు. దీనిపై సర్వే నివేదికను కలెక్టర్‌కు సమర్పించాలని, ఆయనే దీనిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.



పంపా రిజర్వాయర్ ఒడ్డున ఉన్న హరిణి బోట్ షికార్ నిర్మాణాలు



పంపా రిజర్వాయర్ సమీపంలో సర్వే చేస్తున్న అధికారులు

ఆ స్థలం దేవస్థానానిదే..!

గత సర్వేలో తేలినట్టుగానే ఈ సర్వేలో కూడా బోట్ షికార్ నిర్మాణాలతోపాటు, దాని వెనుక 30 మీటర్లు స్థలం దేవస్థానానికే చెందుతుందని తేలినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. పంపా ప్రాజెక్ట్ నిర్మించక ముందు నది లోపల నుంచి బండి బాట ఉండేదని, అక్కడ ఒక సత్రం, సత్యమేవ జయతే అని రాయబడిన ఆర్చి ఉండేదని వారు వివరించారు. అయితే పంపా ప్రాజెక్ట్ నిర్మించినపుడు పంపా రిజర్వాయర్ చుట్టూ ఆరు మీటర్లు స్థలం గట్టుకు కేటాయించారని తెలిపారు. అటు వంటిది రిజర్వాయర్ లోపల స్థలం దేవస్థానానిదే అనడం కరెక్ట్ కాదని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. కాగా, తమ సర్వేలో తేలిన వాస్తవాలను వివరిస్తూ రెండు మూడు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్టు సర్వేయర్లు వివరించారు.

రేపటి నుంచి పోలిసెట్ ఉచిత శిక్షణ

ప్రత్తిపాడు: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ), జన విజ్ఞాన వేదిక (జేవీవీ) సంయుక్త ఆధ్వర్యంలో పోలిసెట్ ఉచిత కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్ జిల్లా కుటుంబ సంక్షేమ పథకం అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు తెలిపారు. ఆయన ప్రత్తిపాడులో సోమవారం కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జగ్గంపేట యూటీఎఫ్ హోమ్‌లో గురువారం నుంచి 29వ తేదీ వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష(పోలీసెట్) ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు చెప్పారు. స్టడీ మెటీరీయల్, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డైలీ ప్రాక్టీసు టెస్టులు నిర్వహించి, ఎక్కువ మంది పోలీసెట్‌కు అర్హత సాధించేలా తర్ఫీదు ఇవ్వనున్నట్టు తెలిపారు. జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, పెద్దాపురం మండలాలకు చెందిన పదో తరగతి పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9866302442, 9059563337, 9966270567 నంబర్లను సంప్రదించాలని ఐ ప్రసాదరావు కోరారు.

పిల్లలను పాఠశాలలో చేర్చండి

జగ్గంపేట: ఇర్రిపాక గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మన ఊరు మన బడి -మన అందరి బడి అనే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి స్వామి, విద్యాశాఖాధికారి–2 సుబ్రమణ్యేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ సూరిబాబు, యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటాం

- జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి దాడిశెట్టి రాజా
- రావికంపాడులో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశం

తొండంగి: గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మంగళవారం తొండంగి మండలం రావికంపాడులో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గం అన్ని గ్రామాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రతి గ్రామంలోని ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో రావికంపాడులో పార్టీ కార్యకర్తలు, నాయకులతో చర్చించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో వారికి కష్టం వస్తే అండగా నిలుస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, పార్టీ నాయకులు గ్రామకన్వీనర్ మేడిశెట్టి సుబ్బారావు, నియోజకవర్గ ఇంటిలెక్చువల్ వింగ్ అధ్యక్షుడు సిద్దా శ్రీనివాసరావు, పార్టీ మండల కమిటీ సభ్యుడు కోడూరి దివానం, సీనియర్ నాయకులు సిద్దా సూర్యనారాయణ, సిద్దా కొండబాబు, ఆరిగెల శేషు, సిద్దా అప్పన్నదొర, మేడిశెట్టి ఫణీంద్రసాయి, సిద్దా రామన్నదొర, వెల్నాటి బుజ్జి, వెల్నాటి శివస్వామి, పంపన రాంబాబు, పేరూరి సత్యనారాయణ, సైనా సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ చవలం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తేవాలి

రౌతులపూడి: కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పని చేసి పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మంగళవారం గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ కుమార్తె వివాహ కార్యక్రమానికి వచ్చిన ఆయనకు, తుని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రౌతులపూడిలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకుడు కేదారిశెట్టి నాగేశ్వరరావు రైస్‌మిల్లు వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా ఇటీవల నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ పదవులు పొందిన బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సర్పంం శ్రీను, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు చెన్నాడ సత్తిబాబులు గిరిబాబు, కృష్ణుడులను శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పార్టీ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ గ్రామస్థాయిలో పర్యటించి పార్టీ అభివృద్ధికి పాటుపడాలని గిరిబాబు, కృష్ణుడు అన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉండి పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అవలింబిస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఏ కార్యకర్త భయపడాల్సిన అవసరం లేదన్నారు. నియజకవర్గంలో ఏ కార్యకర్తకు అన్యాయం జరిగిన వారికి అండగా ఉంటానని ఆయన భరోసాఇచ్చారు. కూటమి ప్రభుత్వం అవలింబిస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పోరాట ప్రతిమతో ఎదుర్కొవాలని అన్నారు. ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు అంగూరి లక్ష్మీశివకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీ నేత వాసిరెడ్డి జమీలు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, వాసిరెడ్డి భాస్కరబాబు, మండల పార్టీ కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, రాయి ప్రసాద్, కాకి నాని, అంకంరెడ్డి సతీష్‌కుమార్, సోమరౌతు తిరుముల వెంకన్నదొర, సైపురెడ్డి వెంకటరమణ, కొరుప్రోలు దేవుడు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలతో సమావేశమైన ముద్రగడ గిరిబాబు, యనమల కృష్ణుడు

టీడీపీ మాజీ ఎంపీటీసీ బరితెగింపు

సామూహిక మరుగుదొడ్డి ఆక్రమణ

శంఖవరం: ఆక్రమణకు కాదేవి అనర్హం అన్నట్టుగా సామూహిక మరుగుదొడ్డిని ఆక్రమించి ఇల్లు నిర్మాణానికి టీడీపీ మాజీ ఎంపీటీసీ సాధనాల లక్ష్మీబాబు బరి తెగించాడు. అధికార బలంతో కత్తిపూడిలో సర్వే నంబరు 223లో ఉన్నప్రజలు వినియోగించే సామూహిక మరుగదొడ్డి ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. దీంతో గ్రామస్తులు ఎంపీడీఓ ఎస్ఎంకేజీ ప్రసాద్‌కు, తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ యూడీబీఆర్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ప్రజలందరూ ఉపయోగించే మరుగుదొడ్డిని దొంగ సర్వే నంబరు 219గా వేసుకుని టీడీపీ నాయకులు ఇల్లు నిర్మిస్తున్నారన్నారు. పంచాయతీ అధికారులకు, వీఆర్వోలకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అలాగే దీనిపై గతంలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. కలక్టర్ పంచాయతీ కార్యదర్శికి ఈ సమస్యపై చర్యలు తీసుకోవాలని సూచించిన పంచాయతీ అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమణ నుంచి రక్షిస్తారని అధికారులను కోరుతున్నారు.వినతిపత్రం ఇచ్చిన వారిలో పెయ్యల కృష్ణ,పెయ్యల నూకరాజు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు సన్మానం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్ సభ్యుడు డి.శ్రీనివాసరావును పట్టణంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉచిత, నిర్బంధ విద్య అమలు కమిటీ సభ్యుడిగా శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు ఏలేశ్వరం మండల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర రాంబాబు ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. రాంబాబు మాట్లాడుతూ తమ అసోషియేషన్‌కు చెందిన శ్రీనివాసరావును కమిటీ సభ్యుడిగా ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డీవీవీ సత్యనారాయణ, టి.విజయబాబు, సీహెచ్ రత్నాజీ, పైల రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

జగ్గంపేట: ప్రైవేట్ స్కూల్ బస్సులు, వ్యాన్లు, ఆటోలు నడిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట సీఐ కార్యాలయం వద్ద స్కూల్ పిల్లలను తీసుకువెళ్లే వాహనాల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతమంది నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారని చెప్పారు. ఇలాంటి పొరపాట్లు లేకుండా స్కూల్ పిల్లలను క్షేమంగా ఇంటి దగ్గర నుంచి స్కూల్‌కి, స్కూల్ నుంచి ఇంటికి చేర్చాలని, మద్యం సేవించి వాహనాల నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్కూల్ పిల్లల వాహనాలు నడిపే ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.



జగ్గంపేటలో సీఐ, ఎస్సైలను సత్కరిస్తున్న స్కూల్ బస్సు డ్రైవర్లు

ఈ కార్యక్రమంలో పాల్గొన్న డ్రైవర్లు సంఘం యూనియన్ అధ్యక్షుడు పైలరాజు, సెక్రటరీ రమణ, యూనియన్ నేతల ఆధ్వర్యంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌ను, ఎస్సై రఘునాథరావును ఘనంగా సత్కరించారు.

శ్రీప్రకాష్ సేవలు అభినందనీయం

- అరట్లకోటలో మినరల్ మంచినీటి ప్లాంట్ ప్రారంభించిన
- హోంమంత్రి వంగలపూడి అనిత

తుని: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు శ్రీప్రకాష్ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం పాయకరావుపేట అరట్లకోటలో శ్రీప్రకాష్ విద్యాసంస్థల పూర్వపు కోశాధికారి కె.రామకృష్ణారావు జ్ఞాపకార్థం రూ.15 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు గ్రామీణ ప్రాంతాలకు రక్షిత మంచినీటిని ఆనందంగా ఉందని, భవిష్యత్ మరెన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ గతంలో పీఎల్ పురం, గుంటపల్లిలో ట్యాంకులను నిర్మించామన్నారు. హోంమంత్రి అనితను శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత నరసింహారావు జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో పెదిరెడ్డి చిట్టిబాబు, గెడ్డం బుజ్జి, తోట నగేష్, సర్పంచ్ అప్పలనర్స, కట్టా శ్రీను, శ్రీప్రకాష్ ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.



అరట్లకోటలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత

ఎస్సీ వర్గీకరణకు వైఎస్సార్ సీపీ సహకరించాలి

జగ్గంపేట: ఎస్సీ వర్గకరణ కోసం సుదీర్ఘ పోరాట చేసిన తర్వాత అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఫలితంగా ఎస్సీ వర్గీకరణకు మార్గం సుగమనం అయిన నేపథ్యంలో రాష్ట్ర అసెంబ్లీలో బిల్లుకు వైఎస్సార్ సీపీ నేతలు సహకరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు తెలిపారు. జగ్గంపేటలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నేత జగన్‌మోహన రెడ్డి అసెంబ్లీలో పాలకమండలి వర్గీకరణకు ఆమోదం తెలపకపోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనంతరపు రాజు మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఎన్యూమరేటర్లకు శిక్షణ

ప్రత్తిపాడు:మండలంలోని మహిళా ఎన్యూమరేటర్లకు మండల మహిళా సమాఖ్య, మండల విద్యాశాఖ మానవ వనరుల కేంద్రంలో రెండు బ్యాచ్‌లుగా మహిళా సంఘ సభ్యులకు సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈశిక్షణలో మహిళా సంఘ సభ్యులకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి రుణ ప్రణాళిక, జీవనోపాదుల ప్రణాళికపై శిక్షణ ఇస్తున్నట్టు వెలుగు ఏపీఎం వై వెంకట్ తెలిపారు. ఈశిక్షణకు సుమారు 150 మంది మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు హాజరయ్యారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసనగా ర్యాలీ

కిర్లంపూడి: క్రైస్తవులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని క్రైస్తవ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఇటీవల హైదారాబాద్ నుంచి రాజమహేంద్రవరం వస్తూ పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పదంగా మృతి చెందడంతో దర్యాప్తును పారదర్శకంగా చేపట్టాలని మంగళవారం కిర్లంపూడిలోని ఆర్‌సీఎం, సెయింట్ పాల్ లూథరన్, ఇమ్మానుయేలు ప్రార్థన మందిరం, చిన్నమంద చర్చిల సంఘాల ఆధ్వర్యంలో కిర్లంపూడి దళితపేట నుంచి జగపతినగరం పెట్రోల్ బంక్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కిర్లంపూడి ఏనుగువీధి సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘాల పెద్దలు కట్టు సూరిబాబు, మద్రా చిట్టిబాబు, మూరా చంటిబాబు, కట్టు నానీ, సాదే బాబ్జి, గుద్దాడి శ్రీను అధిక సంఖ్యలో సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) వద్ద మంగళవారం వివేకానంద సేవా సమితి ఫౌండేషన్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ చలివేంద్రాన్ని సీహెచ్‌సీ సూపరిటెండెంట్ డాక్టర్ బి సౌమ్యమైఖేల్ ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటి సభ్యులు వెలుగుల కొండలరావు (నాని), బొల్లు చిన్న, యర్రవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎంవీ రామరాజువర్మ, వివేకానంద సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేపై శిక్షణ

రౌతులపూడి: మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన జీవనోపాధి, రుణాలను అందించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించాలని వెలుగు ఏపీఎం నాగమణి అన్నారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏలు, ఎన్యుమరేటర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధి కోసం రుణ ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. మహిళా సంఘాల్లోని విద్యావంతులను ఎన్యుమరేటర్లగా నియమించామన్నారు. వీరంతా సంఘ సభ్యులు ఇళ్లవద్దకు వెళ్లి మొబైల్ యాప్ ద్వారా కుటుంబ అవసరాలకు కావలసిన రుణ ప్రణాళికలు తయారు చేయాలన్నారు. అందుకు అవసరమైన వివిధ అంశాలపై ఎన్యుమరేటర్లకు మొబైల్ యాప్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ నెల ఏడు వరకు గ్రామాల్లో సర్వే నిర్వహించి రుణ ప్రణాళికలు తయారు చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు అప్పలకొండ, రతన్‌రాజు, సీత, వీఓఏలు సత్యవతి, కుమారి, ప్రేమలీల, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రౌతులపూడిలో వీఓఏలకు శిక్షణ ఇస్తున్న వెలుగు ఏపీఎం నాగమణి

చిట్టా పుస్తకాలకు పూజలు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో 2025–26 ఆర్థిక సంవత్సరం ప్రారంభం సందర్భంగా మంగళవారం నూతన చిట్టా పుస్తకాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలోని అనివేటి మండపంలో స్వామి, అమ్మవారి పాదాల వద్ద ఈ చిట్టాపుస్తకాలను ఉంచి పండితులు పూజలు చేశారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు, వేదపండితులు, అర్చకులు ఇతర ఉద్యోగులు, వ్రతపురోహితులు, పలువురు భక్తులు స్వామివారికి నగదు కానుకలు సమర్పించగా వాటిని చిట్టా పుస్తకాలలో నమోదు చేశారు. సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, ఉప ప్రధానార్చక వేంకటేశ్వర్లు, అర్చకులు కంచిబట్ల సాయి, దత్తాత్రేయశర్మ, పరిచారకులు యడవిల్లి ప్రసాద్, కొండవీటి రాజా, స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితుడు చామర్తి కన్నబాబు, వ్రతపురోహితుడు పాలంకి పట్టాభి తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏఈఓ కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



సత్యదేవుని ఆలయంలో నూతన చిట్టా పుస్తకాలకు పూజలు నిర్వహిస్తున్న పండితులు